క్లుప్తంగా

వైట్లకు సీఎం జగన్ పరామర్శ



కొవ్వూరు నుంచి వైఎస్సార్ సీపీ నాయకుడు వైట్లను ఫోన్‌లో పరామర్శిస్తున్న సీఎం జగన్

పెనుగొండ: కొవ్వూరు నియోజకవర్గంలో జగనన్న విద్యా దీవెన కార్యక్రమానికి హాజరైన ముఖ్యమంత్రి వైఎస్‌జగన్ మోహన్‌రెడ్డి ఆచంట నియోజకవర్గ వైఎస్సార్ సీపీ నాయకుడు వైట్ల కిషోర్‌ను ఫోన్‌లో పరామర్శించారు. వైట్ల కిషోర్ కుమార్ మాతృమూర్తి, ఆచంట సొసైటీ అధ్యక్షురాలు వైట్ల శారదా దేవి ఇటీవలే గుండెపోటుతో మృతిచెందారు. ఇదే విషయాన్ని కొవ్వూరులో ఆచంట నియోజకవర్గ వైసీపీ నాయకుడు అరిగెల సురేష్ బాబు సీఎం జగన్ దృష్టికి తీసుకు వెళ్లడంతో వెంటనే స్పందించి ఫోన్‌లో పరామర్శించి, ధైర్యంగా ఉండాలన్నారు.

ఇవాంజిలికల్ లూథరన్ సంఘ సర్వసభ్య సమావేశం



నూతనంగా ఎన్నికైన ఉపాధ్యక్ష, కార్యదర్శులను అభినందిస్తున్న దృశ్యం

నరసాపురం: ఆంధ్రా ఇవాంజిలికల్ లూథరన్ సంఘం(ఏఈఎల్‌సీ) 51వ ద్వి వార్షిక మహాసభ రాష్ట్ర గురువారం పట్టణంలోని లూథరన్ చర్చిలో ఘనంగా నిర్వహించారు. ఏఈఎల్‌సీ మోడరేటర్ బిషప్ చింతాల ఏలియా అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడుగా బిషప్ ఎంఏఎస్ మార్టన్స్, కార్యదర్శిగా డాక్టర్ హుస్సేన్‌ను ఎనుకున్నారు. లూథరన్ సంఘాలను, పరిధిలోని చర్చిలను అభివృద్ధి చేయాలని, వివాదాలకు తావులేకుండా దైవ సేవ చేయాలని సమావేశంలో తీర్మానం చేశారు.

ఉపాధి కూలీలకు సౌకర్యాలు కల్పించాలి



ములపర్రులో ఉపాధి కూలీలతో వ్యవసాయ కార్మిక సంఘ నాయకులు

పెనుగొండ: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా గ్రామాల్లో నిర్వహిస్తున్న పనుల్లో ఉపాధి కూలీలకు సౌకర్యాలు కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా కమిటీ సభ్యులు షేక్ పాదుషా డిమాండ్ చేశారు. గురువారం ములపర్రు శివారు పితాని వారిపాలెంలో ఉపాధి పనులను పరిశీలించారు. కనీస సౌకర్యాలు లేక కూలీలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కూలీలకు గాయాలైనా, పాముకాటుకు గురైనా ఫస్ట్‌ఎయిడ్ బాక్సు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. సత్వరం మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో సంఘ నాయకుడు ఎస్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఉత్సాహంగా వేసవి విజ్ఞాన తరగతులు

నరసాపురం: స్థానిక గ్రేడ్–1 శాఖ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిక్షణా తరగతులు ఉత్సాహంగా సాగుతున్నాయి. గురువారం పిల్లలకు వైఎన్ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ డాక్టర్ పొన్నాడ సుబ్రహ్మణ్యం రసాయనశాస్త్రం క్లాసులు నిర్వహించారు. కెమిస్ట్రీలో పిల్లలు భయాలు పెట్టుకోకూడదని చెప్పారు. శాస్త్రవేత్త ఆర్‌వీ సుబ్బారావు కాంతి సంవత్సరం, కాంతివేగం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. స్కూల్ అసిస్టెంట్ సీహెచ్ శ్రీనివాస్ పిల్లలకు నీతి కథలు చెప్పారు. డాన్స్ మాస్టర్ విక్టర్‌రాజు పిల్లలకు డ్యాన్స్ క్లాసులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లైబ్రేరియన్ కేజేఎస్ఎల్ కుమారి పాల్గొన్నారు.

ప్రభుత్వ మహిళా జూనియర్ కళాశాలగా జెడ్పీ పాఠశాల

పెనుగొండ: ప్రభుత్వ ఆదేశాల మేరకు సిద్ధాంతంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యనభ్యసించడానికి బాలికల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రధానోపాధ్యాయుడు శ్రీరామచంద్రమూర్తి తెలిపారు. గురువారం ఆయన విలేకరుతో మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరం నుంచి ఇంటర్ ప్రథమ సంవత్సర బైపీసీ, ఎంపీసీ, సీఈసీ కోర్సుల్లో చేరవచ్చునన్నారు. ప్రత్యేక ఫ్యాకల్టీతో ప్రత్యేక లైబ్రరీ, లేబొరేటరీలతో మహిళా జూనియర్ కళాశాల ప్రారంభమవుతుందన్నారు. ఈ అవకాశాన్ని పరిసర ప్రాంత విద్యార్థినులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు వలంటీర్లకు సత్కారం

పెనుమంట్ర: మండలానికి చెందిన వలంటీర్లకు వందనం కార్యక్రమం శుక్రవారం ఉదయం 9 గంటలకు బ్రాహ్మణచెరువు సెంటర్‌లోని శ్రీ సాయినాథ కళ్యాణమండపంలో జరుగుతుందని మండల పరిషత్ అధ్యక్షుడు కర్రి వెంకటనారాయణ రెడ్డి (వాసు) గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి స్థానిక శాసనసభ్యులు చెరకువాడ శ్రీరంగనాథరాజు ముఖ్య అతిథిగా హాజరై వాలంటీలర్లకు అవార్డులు అందజేస్తారని ఆయన తెలిపారు.

సేవలకు సలాం

- వలంటీర్ల సేవలను గుర్తించిన ప్రభుత్వం
- అవార్డులతో సర్వత్రా ఆనందం

మొగల్తూరు: పార్టీలు, మతాలు, కులాలకతీతంగా ప్రభుత్వ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు నేరుగా అందించడంలో వలంటీర్లు కీలక పాత్ర పోషిస్తున్నారు. వేకువ జామునే లేచి సామాజిక పింఛన్లు అందజేయడం మొదలుకుని ప్రతీ పథకాన్ని లబ్ధిదారులకు అందించి వారి మెప్పు పొందుతున్నారు. అవినీతికి తావు లేకుండా ప్రభుత్వ సంక్షేమ పథకాలను నేరుగా ప్రజల ముంగిటకు తీసుకెళ్లి అందిస్తున్నారు. ప్రభుత్వ ఆశయాలను నెరవేరుస్తూ సంక్షేమ సారథులుగా వలంటీర్లు సేవలు అందిస్తున్నారు. కనీస గౌరవవేతనంతో ప్రజలకు సేవలు అందిస్తున్న వారి సేవలను ముఖ్యమంత్రి గౌరవమిచ్చి సత్కరిస్తున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వలంటీర్ల వ్యవస్థను ప్రవేశపెట్టి వారు చేస్తున్న సేవలను గుర్తించి ప్రతీ ఏటా అవార్డులతో పాటు నగదు బహుమతిని అందిస్తున్నారు. ఈ ఏడాది నరసపురం నియోజకవర్గంలో 1006 మంది వలంటీర్లు ఉండగా నరసాపురం మున్సిపాలిటీలో 370 మందికి గానూ సేవావజ్ర 1, సేవారత్న ఐదుగురికి, నరసాపురం మండలంలో 269 మందికి గానూ ఇద్దరికి సేవావజ్ర, సేవారత్న ఐదుగురికి రాగా మొగల్తూరు మండలంలో 367 మందికి గాను ఇద్దరికి సేవావజ్ర, ఐదుగురికి సేవారత్న అవార్డులు అందించారు.



మొగల్తూరులో వలంటీర్లకు నమూనా చెక్కును అందిస్తున్న చీఫ్ విప్ ప్రసాదరాజు (ఫైల్)

ఒకే సచివాలయంలో ఇద్దరికి సేవావజ్ర అవార్డులు

ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గంలో అత్యుత్తమ ర్యాంకు సాధించిన మొదటి అయిదుగురు వలంటీర్లకు సేవా వజ్ర అవార్డులు అందిస్తున్నారు. అయితే మొగల్తూరు 1వ సచివాలయంలో విధులు నిర్వహిస్తున్న ఇద్దరు వలంటీర్లకు సేవావజ్ర అవార్డులు దక్కడం విశేషం. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తమకు ప్రజలకు సేవచేసే అవకాశం కల్పించడమే కాక ప్రతీ ఏటా అవార్డుతో నగదు ప్రోత్సాహకం అందించడం ఆనందంగా ఉందని వలంటీర్లు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వలంటీర్ల సేవలు అభినందనీయం



ఏ ఆశయంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి వలంటీర్ల వ్యవస్థను ప్రవేశపెట్టారో? ఆ ఆశయం నెరవేర్చడంలో వలంటీర్లు సఫలీకృతం అవుతున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలలు అందించడంలో వలంటర్లు అందిస్తున్న సేవలు అభినందనీయం.

– ముదునూరి ప్రసాదరాజు, చీఫ్‌విప్

వజ్ర అవార్డు రావడం సంతోషంగా ఉంది



నేను అందిస్తున్న సేవలను గుర్తించిన ప్రభుత్వం నాకు సేవా వజ్ర అవార్డు అందిచడం చాలా ఆనందంగా ఉంది. ప్రజలకు సేవ చేస్తూ ప్రభుత్వం నుంచి అవార్డు అందుకోవడం గర్వంగా భావిస్తున్నాను. ఇకపై మరింత భాద్యతగా విధులు నిర్వహిస్తాను.

– వెలిది సూర్యకుమారి, వలంటీర్

సేవ చేసే అవకాశం కలిగింది



గత రెండు సంవత్సరాలుగా సేవా మిత్ర అందుకున్న నేను మూడో ఏడాది సేవా వజ్ర అవార్డుకు ఎంపికవడం చాలా ఆనందంగా ఉంది. ప్రజలకు మరింత సేవ చేసే అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి జగన్ సార్‌కు, చీఫ్‌విప్ ప్రసాదరాజు సార్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నాను.

– దాడి భారతీ దేవి, వలంటీర్

నేడు విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక

యలమంచిలి: విద్యుత్ సరఫరాలో హెచ్చుతగ్గులు, బిల్లుల్లో సమస్యలు, కొత్త సర్వీసుల జారీలో జాప్యం, బిల్లుల్లో పేరు మార్పులు, విద్యుత్ సరఫర పునరుద్ధరణలో ఇబ్బందులు తదితర సమస్యలపై ప్రజల ఇబ్బందులను తెలుసుకోవడానికి శుక్రవారం అడవిపాలెంలో విద్యుత్ సమస్యల పరిష్కారవేదిక నిర్వహిస్తున్నట్లు నరసాపురం డివిజన్ ఎలక్ట్రికల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బి సురేష్‌కుమార్ తెలిపారు. యలమంచిలి విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. పాలకొల్లు పట్టణం, మండల సబ్ డివిజన్ పరిధిలోని విద్యుత్ వినియోగదారులకు ఉదయం పదిన్నర గంటల నుంచి పదకొండున్నరవరకు గంటపాటు ఉల్లంపర్రులోని అల్లూరి సత్యనారాయణరాజు ఐటీఐ కళాశాలలో పరిష్కార వేదిక నిర్వహిస్తామన్నారు. అడవిపాలెం విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద ఉన్న సబ్ డివిజన్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయంలో పదకొండున్నర గంటల నుంచి మరొక పరిష్కార వేదిక నిర్వహిస్తామన్నారు. పై సమస్యలు ఎదుర్కొంటున్న వినియోగదారులు ఈ పరిష్కార వేదికలకు తమ సమస్యను లిఖిత పూర్వకంగా అందజేస్తే సాధ్యమైనంత త్వరగా పరిష్కరిస్తామని ఆయన వివరించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

పోడూరు: పోడూరు, కొమ్ముచిక్కాల గ్రామాల్లోని 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లలో 33కేవీ ఫీడర్‌లైన్‌ల మరమ్మతులు, చెట్ల తొలగింపు కారణంగా ఆయా సబ్‌స్టేషన్ పరిధిలోని పోడూరు, మినిమించిలిపాడు, పండితవిల్లూరు, తూర్పుపాలెం, కవిటం, జగన్నాథపురం, వేడంగి, వేడంగిపాలెం, జిన్నూరు, మట్టపర్రు, కొమ్ముచిక్కాల, పి.పోలవరం, జిన్నూరుపాలెం గ్రామాల్లోనూ, పాలకొల్లు మండలంలోని వాలమర్రు, కాపవరం గ్రామాల్లోనూ శుక్రవారం ఉదయం ఏడు గంటలనుంచి మధ్యాహ్నం రెండుగంటల వరకు, పెనుమదంలోని 33/11కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో పెనుమదం, గుమ్ములూరు, రావిపాడు, పైడావ గ్రామాల్లో ఉదయం ఏడు గంటల నుంచి పన్నెండు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఎలక్ట్రికల్ ఈఈ బి.సురేష్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.

దగ్గులూరులో..

పాలకొల్లు అర్బన్: మండలంలోని దగ్గులూరులో నిర్మిస్తున్న మెడికల్ కళాశాలకు విద్యుత్ సరఫరా ఏర్పాటు నిమిత్తం శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఎలక్ట్రికల్ డివిజనల్ ఇంజనీర్ బి.సురేష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కారణంగా దగ్గులూరు పంచాయతీ పరిధిలోని శ్రీలంక కాలనీ, చినపేట, పెదపేట, మర్రిపుంత, చంద్రరావు గారి తోట, శివాలయం (మెయిన్‌రోడ్డు), గౌడ వీధి, జగనన్న లే అవుట్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

యలమంచిలిలో..

యలమంచిలి/నరసాపురం: నరసాపురం నుంచి యలమంచిలి, కాజ, ఇలపకుర్రు విద్యుత్ సబ్ స్టేషన్స్ వచ్చే 33 కేవీ విద్యుత్ లైన్ల మరమ్మతులు, ట్రీ కటింగ్ కారణంగా శుక్రవారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని విద్యుత్ శాఖ నరసాపురం డివిజన్ ఎలక్ట్రికల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బి.సురేష్ కుమార్ గురువారం విలేకర్లకు తెలిపారు. యలమంచిలి, కాజ, ఇలపకుర్రు సబ్ స్టేషన్స్ పరిధిలోని అన్ని గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. నరసాపురం పట్టణంలోని క్రిస్టియన్‌పేట, స్టేషన్‌పేట, జవదాలవారిపేట, చినమామిడిపల్లి, నాగారమ్మగుడి ఏరియా, లాకుపేట, పాలకొల్లు రోడ్డు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్టు చెప్పారు. విద్యుత్ వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

సమస్యల పరిష్కారానికి సహకరించాలి

పెనుగొండ: సిద్ధాంతంలో ప్రతీ ఏటా గరగాలమ్మ డ్రయిన్ మురుగుతో ముప్పు వాటిల్లుతుందని ప్రజలు గడపగడపకు మన ప్రభుత్వంలో విన్నవించుకున్నారని, సమస్య పరిష్కారానికి ప్రతీ ఒక్కరూ సహకరించాలని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. గురువారం సిద్ధాంతంలో గరగాలమ్మ డ్రెయిన్ పనులను పర్యవేక్షించారు. డ్రెయిన్‌ను ఆనుకొని ఉన్న ఆక్రమణదారులు సహకరించాలన్నారు. ఇళ్లు కోల్పోయిన వారికి ఇంటి స్థలాలు మంజూరుతో పాటు, ఇంటిరుణాలు అందిస్తామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో పోడూరు జెడ్పీటీసీ సభ్యుడు గుంటూరి పెద్దిరాజు, సర్పంచ్ చింతపల్లి గనిరాజు(చంటి), ఎంపీటీసీ చిన్నం ఏడుకొండలు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.



సిద్ధాంతంలో గరగాలమ్మ డ్రెయిన్ పనులను పరిశీలిస్తున్న మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు

బాధితులకు పరామర్శ

వడలి సొసైటీ అధ్యక్షుడు రంభ శ్రీనివాస్ కుటుంబాన్ని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు గురువారం పరామర్శించారు. అనారోగ్యంతో రంభ శ్రీనివాస్ ఇటీవలే మృతి చెందారు. కుటుంబాన్ని అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. అదే విధంగా పెనుగొండ మారేమ్మ గూడెంలో వైఎస్సార్ సీపీ నాయకుడు మెరిపే నానీ మాతృమూర్తి ఇటీవల మృతి చెందడంతో వారి కుటుంబాన్ని పరామర్శించి సంతాపం వ్యక్తం చేశారు. వీరితో పాటు చెరుకువాడలో వైఎస్సార్ సీపీ నాయకుడు వరికూటి నరేంద్ర మాతృమూర్తి ఇటీవల మృతి చెందడంతో పరామర్శించారు. ఆయా ప్రాంతాల్లో జరిగిన పరామర్శ కార్యక్రమాల్లో పార్టీ రాష్ట్ర కార్యదర్శి మేడపాటి సాయిచంద్ర మౌళీశ్వర రెడ్డి, పార్టీ నాయకుడు పోడూరి రామయ్య, నాగిశెట్టి నరసింహారావు, సుంకర నాగబాబు, పలివెల శ్రీను, సురేష్, రంభ సూర్యనారాయణ, రంభరామారావు పాల్గొన్నారు.



వడలి సొసైటీ అధ్యక్షుడు రంభ శ్రీను కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు

యువతను ప్రోత్సహించాలి

పెనుగొండ: గ్రామీణ ప్రాంతాల్లో యువతను ప్రతీ ఒక్కరూ ప్రోత్సహించాలని పెనుగొండ మండల సర్పంచ్‌ల ఛాంబర్ అధ్యక్షురాలు దండు పద్మావతి అన్నారు. గురువారం ఇలపర్రు శివారు అభోతుల దిబ్బలో నిర్వహిస్తున్న అంబేడ్కర్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రతిభకు కొదవలేదన్నారు. వీరిని ప్రోత్సహిస్తే మరింతగా రాణిస్తారన్నారు. ప్రభుత్వపరంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి యువతకు అండగా నిలుస్తున్నారన్నారు. నియోజకవర్గంలోనూ మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు సహాయ సహకారాలు అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ వేండ్ర వెంకటేశ్వర్లు, పులిదిండి వెంకటేశ్వర్లు, గుణపాటి సంజీవరావు, కటికదల మోహనరావు తదితరులు పాల్గొన్నారు.



ఇలపర్రులో క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న సర్పంచ్‌ల ఛాంబర్ అధ్యక్షురాలు పద్మావతి

బైక్ ఢీకొని రోడ్డుపై ఆవుల మృతి

పాలకొల్లు సెంట్రల్: బైక్ ఢీకొట్టడంతో గర్భంతో ఉన్న ఆవు మృతి చెందిన సంఘటన పట్టణంలోని యడ్లబజారు సెంటర్‌లో చోటుచేసుకుంది. గురువారం సొసైటీ ప్రివెన్షన్ యానిమల్ క్రుయాలిటీ సభ్యుడు మనీష్ గౌడ్ తెలిపిన వివరాలు ప్రకారం బుధవారం రాత్రి రోడ్డుపై సంచరిస్తున్న గర్భంతో ఉన్న ఆవును స్కూటీ వాహనంతో ముగ్గురు యువకులు మద్యం మత్తులో వేగంగా వెళుతూ ఆవు పొట్టను ఢీకొట్టడంతో ఆవు అక్కడికక్కడే మృతి చెందినట్లు స్థానికులు తెలిపారన్నారు. అలాగే మరో ఆవును గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో కదలలేని స్థితిలో ఉందని, దీంతో ఆ ఆవును ఆసుపత్రికి తరలించే లోపు మృతి చెందినట్లు తెలిపారు. మునిసిపల్ శానిటరీ అధికారులకు విషయం తెలియజేయడంతో ఆ రెండు ఆవులను ఖననం చేయడానికి తరలించినట్లు మనీష్ తెలిపారు.

సీనియర్ సిటిజన్స్ సంఘ నూతన అధ్యక్షుడిగా వంగా

పాలకొల్లు సెంట్రల్: పట్టణ సీనియర్ సిటిజన్స్ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గ అధ్యక్షుడిగా వంగా నరసింహారావు ఎంపికయ్యారు. గురువారం స్థానిక లయన్స్ కమ్యూనిటీ హాలులో జరిగిన సమావేశంలో నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం చేశారు. సంఘ గౌరవాధ్యక్షుడిగా వేగేశ్న వెంకట తిరుపతిరాజు, అధ్యక్షుడిగా వంగా నరసింహరావు, సెక్రటరీ ముత్యాల రామారావు, ట్రెజరర్‌గా మాఘం బాల కొండలరావు, అసోసియేట్ అధ్యక్షుడిగా కొండ్రెడ్డి సూర్యనారాయణ, ఉపాధ్యక్షుడిగా కొల్లి నరసింహరావు, కె.వి.ఎస్.ఎల్ నరసింహరాజు, ఆర్గనైజింగ్ సెక్రటరీ పేరిచర్ల సత్యప్రతాప్‌రాజు, జాయింట్ సెక్రటరీ కారుమూరి వెంకట దుర్గాప్రసాద్, గుత్తుల సత్యనారాయణమూర్తి, కలిదిండి వెంకటపతి వర్మ, పది మంది కార్యవర్గ సభ్యులుగా ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు వి.నారాయణమూర్తి, జిల్లా అధ్యక్షులు అడ్డాల నాగ సూర్య సత్యనారాయణ, కె.సూర్యనారాయణ, రంగారావు, వీవీ తిరుపతిరాజు, డాక్టర్ సీహెచ్ సత్యనారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.



సీనియర్ సిటిజన్స్ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం

మెరిట్ విద్యార్థులకు దాతలు చేయూతనివ్వాలి

సాక్షి, భీమవరం: ప్రతిభ కలిగి పేదరికంతో ముందుకు సాగలేని విద్యార్థులకు ప్రభుత్వంతో పాటు స్వచ్ఛంద సంస్థలు కూడా చేయూతనందించాలని ఆర్డీవో దాసి రాజు అన్నారు. భీమవరం చాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో శ్రీ విజ్ఞానవేదిక అధ్వర్యంలో ఇంటర్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రతిభ అవార్డులను అందించారు. ఈ సందర్భంగా ఆర్డీవో దాసి రాజు మాట్లాడుతూ ప్రతిభవంతులను ప్రభుత్వం కూడా అనేక పథకాలతో సహకారం అందిస్తోందని, 32 ఏళ్లుగా శ్రీవిజ్ఞానవేదిక ఎంతో మంది దాతల సహకారంతో ప్రతిభవంతులకు ప్రోత్సాహక అవార్డులు అందివ్వడం అభినందనీయమన్నారు. అధిక శాతం ఇంటర్ విద్యార్థులు ఉత్తీర్ణత సాధించడం జిల్లాకే గర్వకారణమని అన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ 2023–24 ఇంటర్ విద్య సంవత్సరంలో భీమవరంలోని అన్ని జూనియర్ కళాశాలల్లో అత్యధిక మార్కులు సాధించిన 42 మంది విద్యార్థులకు ప్రతిభ ప్రోత్సాహక అవార్డులను లయన్స్ క్లబ్, బార్ అసోసియేషన్ ఆర్థిక సహకారంతో మెడల్స్, ప్రశంసా పత్రాలను ఆర్డీవో దాసి రాజు చేతుల మీదుగా అందజేశామన్నారు. డాక్టర్ సౌజన్య, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.వెంకట రమణ, నందమూరి రాజేష్, కె.రవి, కె.మురళీకృష్ణంరాజు, కె.భవాని శితల్, ఉండపల్లి రమేష్ నాయుడు, భట్టిప్రోలు శ్రీనివాస్, ఇందుకూరి ప్రసాద్ రాజు పాల్గొన్నారు.



ఇంటర్ విద్యార్థినికి మెడల్ అందజేస్తున్న ఆర్డీఓ దాసిరాజు

మహిళపై దాడి చేసిన ఇద్దరిపై కేసు

నరసాపురం: మహిళపై దాడి చేసిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్టు పట్టణ పీఎస్ హెడ్ కానిస్టేబుల్ జె.నాగేశ్వరరావు చెప్పారు. పట్టణంలోని పొన్నపల్లిలో గురువారం పెమ్మాడి ఏసు, పెమ్మాడి రామన్న సోదలు ఇద్దరూ గొడవపడుతూ రోడ్డుపై కేకలువేసుకుంటూ, బూతులు తిట్టుకుంటూ న్యూసెన్స్ చేస్తున్నారు. ఈ క్రమంలో అక్కడే నివాసం ఉంటున్న తిరుమాని మంగతాయారు వారిని వారించడంతో ఇద్దరూ ఆమెపై తిరగబడి దాడి చేశారు. దీంతో మంగతాయారు పోలీసులను ఆశ్రయించింది.

ప్రమాదకరంగా రోడ్డు మార్జిన్

పెనుమంట్ర: వెలగలవారిపాలెం రోడ్డులో పెనుమంట్ర పంచాయతీ చెరువు వద్ద గోస్తనీ పంట కాలువలో ఉన్న పశువుల రేవుకు తక్షణమే మరమ్మతులు చేసి ఈ రోడ్డులో ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని స్థానిక రైతులు కోరుతున్నారు. ఈ పశువుల రేవు పూర్తిగా పాడై రోడ్డు కోతకు గురికావడం వల్ల పశువులు కాలువలో దిగడానికి ఇబ్బందికరంగా ఉండటమే కాకుండా రోడ్డున వెళ్లే ప్రయాణికులకు కూడా ఇక్కడ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని పశువుల రేవు వద్ద రిటైనింగ్ వాల్ నిర్మించి రోడ్డు ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా పశువుల రేవును ఏటవాలుగా నిర్మించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానిక రైతులు, ప్రయాణికులు కోరుతున్నారు.



వెలగలవారిపాలెం రోడ్డులో ప్రమాదకరంగా ఉన్న రోడ్డు మార్జిన్, పశువులరేవు

శానిటరీ ఇన్‌స్పెక్టర్ జేడీవీ మృతికి నివాళి

భీమవరం(ప్రకాశం చౌక్): మునిసిపల్ శానిటరి ఇన్‌స్పెక్టర్ జేడీవీ సత్యనారాయణ గురువారం అనారోగ్యంతో మృతి చెందారు. మున్సిపల్ కార్యాలయంలో జేడీవీ చిత్రపటానికి ఉద్యోగులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ కమిషనర్ బి.జ్యోతిలక్ష్మి మాట్లాడుతూ జేడీవీ మృతి బాధాకరం అన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిజేస్తున్నామన్నారు. మున్సిపల్ ఉద్యోగులు కామేష్‌బాబు, చంటి, రాజు, మహంకాళీ, కృష్ణమోహన్, జగన్ తదితరులు నివాళులర్పించారు.

బ్యాంకింగ్ సేవలపై అవగాహన

నరసాపురం: ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజం ఎస్‌బీఐ తన సేవలను గ్రామీణులకు మరింత దగ్గర చేసే ప్రయత్నం చేస్తుందని నరసాపురం ఎస్‌బీఐ మెయిన్‌బ్రాంచ్ చీఫ్ మేనేజర్ చినిమిల్లి రాము సూచించారు. గురువారం సాయంత్రం ఎస్‌బీఐ ఆధ్వర్యంలో చిట్టవరం గ్రామంలో గ్రామ సాచంత్రం శిబిరం పేరుతో గ్రామస్తులకు బ్యాంకింగ్ సేవలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా చీఫ్ మేనేజర్ రాము మాట్లాడుతూ సురక్ష, భద్రత కలిగిన లావాదేవీలకు ఎస్‌బీఐ లాంటి ప్రభుత్వ బ్యాంకింగ్ సేవలు వినియోగించుకోవాలన్నారు.

ఆటో ఢీకొట్టడంతో కేటరింగ్ కార్మికులకు గాయాలు

పాలకొల్లు అర్బన్: కేటరింగ్ నిమిత్తం పాలకొల్లు నుంచి మోటార్‌సైకిల్‌పై సఖినేటిపల్లి వెళుతున్న ముగ్గురిని శుక్రవారం ఆటో ఢీకొనడంతో గాయాలపాలయ్యారు. ఈ కేసుకి సంబంధించి పాలకొల్లు రూరల్ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని బెత్లహాం పేటకు చెందిన యార్లగడ్డ తాతయ్య, అతని కుమారుడు అనిల్‌కుమార్, వీరి బంధువు ఏసేబురాజు మోటార్ సైకిల్‌పై సఖినేటిపల్లి వెళుతున్నారు. సగం చెరువు శ్మశానం వద్ద వీరిని ఎదురుగా వస్తున్న ఆటో ఢీకొనడంతో తాతయ్య, అనిల్‌కుమార్‌లకు తీవ్రగాయాలయ్యాయి. ఏసేబురాజుకి స్వల్ప గాయాలయ్యాయి, వీరు ముగ్గుర్ని పాలకొల్లు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్య నిమిత్తం పాలకొల్లులోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. మొగల్తూరు పంచాయతీ పరిధిలోని లక్కువారిపేటకు చెందిన ఆటో డ్రైవర్ వీరవల్లి హనుమంతుని అదుపులోకి తీసుకున్నారు. ఎస్సై సరిదే శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పెనుమంట్రలో 80 శాతం ధాన్యం కొనుగోళ్లు పూర్తి

పెనుమంట్ర: పెనుమంట్ర మండలంలోని 16 రైతు భరోసా కేంద్రాల వద్ద ఇప్పటి వరకూ 3372 మంది రైతుల నుంచి 27311 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు మండల వ్యవసాయ అధికారిణి అడబాల జ్యోషుల గురువారం తెలిపారు. ఇప్పటి వరకూ మండలంలో 80 శాతం ధాన్యం కొనుగోలు పూర్తి చేసినట్లు ఆమె తెలిపారు. మండలంలో దాదాపు ధాన్యం మాసూళ్లు పూర్తికావచ్చాయని దాదాపు 70 నుంచి 80 ఎకరాలు మాత్రమే కోతకోయాల్సి ఉందని ఆమె తెలిపారు. మాసూళ్లు చేసిన ధాన్యం ఇంకా 20 శాతం రాశుల్లో ఉందని రెండు మూడు రోజులలో పూర్తిస్థాయిలో ధాన్యం కొనుగోలు పూర్తి అవుతాయని ఇప్పటి వరకూ కొనుగోలు చేసిన ధాన్యాన్ని రైస్ మిల్లులకు రవాణా చేసినట్లు ఆమె తెలిపారు. ఇప్పటి వరకూ రైతు భరోసా కేంద్రాల ద్వారా ఆలమూరు రైతు భరోసా కేంద్రంలో 231 మంది రైతుల నుంచి 2183 మెట్రిక్ టన్నులు, భట్లమగుటూరులో 230 మంది రైతుల నుంచి 2022, జుత్తిగలో 256 మంది రైతుల నుంచి 1732, మల్లిపూడిలో 212 మంది రైతుల నుంచి 1395, మాముడూరులో 268 మంది రైతుల నుంచి 1584, మార్టేరులో 296 మంది రైతుల నుంచి 1977, నత్తారామేశ్వరంలో 135 మంది రైతుల నుంచి 1024, నెలమూరులో 189 మంది రైతుల నుంచి 1429, ఓడూరులో 165 మంది రైతుల నుంచి 2087, పెనుమంట్ర 1లో 112 మంది రైతుల నుంచి 793, పెనుమంట్ర 2 లో 242 మంది రైతుల నుంచి 2066, పాలమూరులో 272 మంది రైతుల నుంచి 2537, సత్యవరంలో 224 మంది రైతుల నుంచి 1807, వెలగలవారిపాలెంలో 186 మంది రైతుల నుంచి 1625, సోమరాజు ఇల్లిందలపర్రులో 348 మంది రైతుల నుంచి 2039, వెలగలేరులో 79 మంది రైతుల నుంచి 470 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని నిన్నటి వరకూ కొనుగోలు చేసి రైస్‌మిల్లులకు రవాణా చేసామని రైతులందరికీ ఆయా రైతు భరోసా కేంద్రంలో గోనె సంచులు అందుబాటులో ఉన్నాయని ఆమె తెలిపారు.



ఇల్లిందలపర్రు లాకుల రోడ్డులో మాసూళ్లు చేసిన ధాన్యం బస్తాలు, రాశులు